అమ్మో.. జూన్..

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. 11 నెలల పాటు ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చిన పేద, మధ్యతరగతి కుటుంబాలు జూన్ వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. 'అమ్మో.. జూన్' అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజులపాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలపై కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, మరో పక్క ఖరీఫ్ సీజన్ మొదలయ్యేది కూడా ఇదే నెల కావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో అప్పలు చేయక తప్పదని కుటుంబ పెద్దలు వాపోతున్నారు...

బెంబేలెత్తుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు

అటు వ్యవసాయానికి..
ఇటు విద్యకు డబ్బులు పెట్టాల్సిందే...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జూన్ నెల వచ్చిందంటే సామాన్యులకు దడ మొదలైనట్లే. స్కూళ్ల ప్రారంభం, వ్యవసాయ పనులు ప్రారంభం నేపథ్యంలో ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం, బ్యాగులు ఇతర సామగ్రి కొనుగోళ్లతో తల్లిదండ్రులకు చుక్కలు కనపడతాయి. మరోపక్క ఖరీఫ్ సీజన్‌లో పత్తి, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇచ్చేందుకు కూడా పెట్టుబడి పెట్టాల్సిందే. ఆపై నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబానికి ఈ నెలలో సుమారు రూ.లక్షకుపైనే ఖర్చు వచ్చి పడుతుంది. చాలీచాలని వేతనాలతో, పైసాపైసా కూడబెట్టుకునే సామాన్యులు ఈనెల గడిచేదెలా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఏటికేడు పెరుగుతున్న పాఠశాలు, కళాశాల ఫీజులు, అందుకయ్యే ఖర్చు తలచుకుంటేనే వారి గుండె గుభేల్‌మంటోంది. నెలవారీ జీతాలపైనే ఆధారపడి జీవితాలను నెట్టుకొచ్చే మధ్యతరగతి కుటుంబాలు సతమతమవుతున్నాయి. ముఖ్యంగా ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు ఫీజులు, డొనేషన్లు, బస్సు చార్జీలు, యూనిఫారం, పుస్తకాల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. పైగా ఇతర సామగ్రి ధరలు పెరిగిపోయాయి. కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి పిల్లల పుస్తకాలకు రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. తాము ఎలా ఉన్నా, తమ పిల్లల భవిష్యత్తు బంగారంలా ఉండాలని భావిస్తూ తల్లిదండ్రులు భారంగానే పుస్తకాలు కొంటున్న పరిస్థితి. ఇదే సమయంలో ఇతర ఖర్చులు పెరిగిపోయాయి. విద్యుత్ బిల్లుల నుంచి నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలు చూపెడుతున్నాయి.

ప్రయివేటులో భారీగా డొనేషన్లు

పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటి ప్రచారాలకు తెర లేపాయి. తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ క్యాంపెయిన్ ముమ్మరం చేశాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలనే ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణాల్లోని పాఠశాలలను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ డొనేషన్లు, ఫీజుల మోత విని భయ పడుతున్నారు. యుకెజి, ఎల్‌కెజి స్థాయిలోనే రూ.వేలకు వేలు ఫీజులు చెబుతుండడంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులకు గుర్తొచ్చేది ఫీజలు, పుస్తకాలే. ముఖ్యంగా పాఠశాలలో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్ పుస్తకాలతోపాటు వాటిని భద్ర పరచుకునేందుకు భారీ బ్యాగులు, దానికి తోడు లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్.. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన దుకాణంలో కొనుక్కునేవారు. ఇప్పుడు ప్రయివేట్ పాఠశాలల పంథా మారింది. పుస్తకాలు, బెల్టు, టై, యూనిఫారం అన్నీ ఆయా పాఠశాలల్లోనే కొనాల్సిన పరిస్థితి. పాఠశాలల యాజమాన్యాలు చెప్పిన ధర చెల్లించలేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఒకవైపు ఆర్థిక భారం.. మరోవైపు పిల్లాడి భవిష్యత్తు కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు. అడ్మిషన్ నుంచి తరగతి గదిలో అడుగు పెట్టేంత వరకు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైపోతుందని వాపోతున్నారు.

మరోపక్క వ్యవసాయం భారమే

జూన్ నెలలో వ్యవసాయ పనుల్లో పెట్టుబడి పెట్టాల్సిందే. ఒక ఎకరాకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టాల్సిందే. అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల పెట్టుబడి పెట్టినా చేతికి రాక అప్పుల పాలవక తప్పదు. మరో వైపు నకిలీ విత్తనాల బెడద వెంటాడుతోంది. జూన్ నెల అంటేనే రెండు పక్కల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

విత్తనాలు తెచ్చుకోవాలి

ఈ సంవత్సరం తొలకరి వానలు ముందే కురవడంతో సాగుకు సిద్ధవుతున్నాం. 8 ఎకరాల్లో కంది పంట వేస్తున్నాను. ఇప్పటికే దుక్కులు అయిపోయాయి. ఇంక విత్తనాలు తెచ్చుకోవాలి. రైతులు ఆరుతడి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులకు ఈ నెలలో విత్తనాల మీద వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది.

- లోకేష్, హాలహర్వి.

ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సులు

- ప్రభావిత గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు
- బాధితులకు పునరావాస కేంద్రాల ద్వారా సాయం
- ప్రజాశక్తితో ఉమ్మడి జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అధికారి సుధాకర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఫ్లోరోసిస్ వ్యాధి ప్రమాంతకం కాదని, అయితే ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులు శారీరక రుగ్మతలతో జీవితాంతం బాధపడుతూ ఉంటారని, వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని ఉమ్మడి కర్నూలు జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ జి సుధాకర్ తెలిపారు. ఫ్లోరోసిస్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రభావిత గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బాధితులకు పునరావాస కేంద్రాల ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

అధికారి : ఫ్లోరోసిస్ ప్రభావిత గ్రామాలలో, పాఠశాలల్లో ఫ్లోరోసిస్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షల కోరకు ఫ్లోరోసిస్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా మొదటి తరగతి నుండి ఐదో తరగతి (6 నుండి 12 సంవత్సరాల వయస్సు) విద్యార్థులతో పాటు అన్ని వయస్సుల వారికి ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో ఫ్లోరోసిస్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నాము. దీనిలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య సిబ్బందికి ఫ్లోరోసిస్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమము నిర్వహిస్తున్నాం.

ఫ్లోరోసిస్ వ్యాధి ఎలా వస్తుంది?

అధికారి : ఫ్లోరైడ్‌ను అధికంగా తీసుకోవడం వల్ల ఫ్లోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. ఇది ప్రజారోగ్య సమస్య. ఇది చాలా భాదకరమైన జబ్బు. ఇది ఇరవై మీటర్లు కన్నా ఎక్కువగా లోతు తీసినటువంటి భూగర్భ జలాల్లో బోర్‌వెల్ త్రాగునీటిలో ఫ్లోరైడ్ అధికముగా ఉంటుంది. అలాగే టూత్‌పేస్టులు, నోటిని శుభ్రం చేసుకునే ద్రవాలు, మందులు, పొగాకు సంబందిత అలవాటు ద్వారా, నల్ల ఉప్పు, బ్లాక్ టీ వినియోగించడము ద్వారా, ఫ్యాక్టరీల నుండి వచ్చే ఫ్లోరైడ్ దుమ్ము , పొగల ద్వారా, ఫ్లోరైడ్ గల లవణాన్ని మరియు హైడ్రోఫ్లోరిక్ ఆమ్లంను వినియోగించడం వల్ల మన శరీరంలోకి ఫ్లోరైడ్ చేరుతుంది.

మనిషి శరీరంలో ఫ్లోరైడ్ ఎంత శాతం ఉండాలి?

అధికారి : మన శరీరం లో ఉండవల్సిన మోతాదు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఒక లీటరు నీటికి 1.5 మిల్లీ గ్రాములు/పార్ట్స్ పర్ మిలియన్ కన్నా తక్కువ. ఇది మానవునిలో శోషణకు హద్దుగాను ఉన్నది.

ఫ్లోరోసిస్ ఎన్ని రకాలుగా ఉంటుంది ?

అధికారి : ఫ్లోరోసిస్ అనే వ్యాధి మూడు రకాలుగా ఉంటుందని వీటిలో మొదటిది దంతాలకు సంబంధించినది. ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల పళ్లమీద అడ్డంగా పసుపు రంగు గీతలు ఏర్పడటం జరుగుతుంది, అంతే కాకుండా చాక్ పీస్ రంగులోకి మరడం, గుంటలు గుంటలు ఏర్పడటం, బ్లాక్ లేదా బ్రౌన్ కలర్ లో మచ్చలు ఏర్పడటం, చిగురులు నల్లగా అయిపోవటం, చివరగా ఎనామిల్ పొర దెబ్బ తిని పిప్పిపళ్ళుగా మారి పోవటం జరుగుతుంది. దీని వలన నామోషిగా అనిపించి ఇతరులతో కలవలేక పోవటం మరియు తలనొప్పి రావడం. అంతే కాకుండా పిప్పి పళ్ళ ఉన్నవాళ్ళు సరైన పౌష్టికాహారం తీసుకోలేరు. పోషకాహార లేమితో రోగనిరోధక శక్తి తగ్గి పోయి అనేక వ్యాధులకు గురవుతారు. రెండవది ఎముకలకు సంభందించిన ఫ్లోరోసిస్. ఈ వ్యాధి వల్లన చేతులు, కాళ్ళు వంకరలు పోవడము మరియు దొడ్డి కాళ్లు రావడం జరుగుతుంది. ముఖ్య ముగా మెడ, వెన్నెముక భాగాలు గట్టిగ మారి సహజమైన స్థిర కదలికలను కోల్పోతాయి. ఇది శరీరంలోని కీళ్లను దెబ్బ తీస్తుంది. ఫ్లోరైడ్ కారక నీరు తాగడం వల్లన కిడ్నీ సంభందిత వ్యాధులకు గురవుతారు. మూడవది అస్థి రహిత ఫ్లోరోసిస్. శరీరంలోని ఎముకల తో సంబంధంలేని ఇతర భాగాల మీద కూడ ఫ్లోరోసిస్ ప్రభావం ఉంటుంది. ఉదాహరణకు ప్రధానంగా శరీరం లో కండరాల బలహీనత మరియు బిగుసుకుపోవడం, నరాల బలహీనత, లిగమెంట్లు, కణజాలములు, ఎర్ర రక్త కణాలు, వీర్య కణాలు, ఉదరభాగంలోని జీర్ణ వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది.

ఫ్లోరోసిస్ వ్యాధికి చికిత్స మందులు ఉన్నాయా?

అధికారి : ఈ ఫ్లోరోసిస్ వ్యాధికి ఎలాంటి మందులు మరియు చికిత్సలు లేవు. ఈ వ్యాధిని నివారించాలి అంటే మినరల్ వాటర్‌ను తాగడం, కాల్షియం పదార్థాలయిన పాలు, పాల ఉత్పత్తులు, గుడ్లు, రాగులు, నువ్వులు, ఆకుకూరలను, పుల్లగా ఉన్న అన్ని రకాల పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. విటమిన్ సి అధికంగా ఉండే ఉసిరి, నిమ్మకాయ, జామకాయ, నారింజ, ద్రాక్ష, టమోటా లాంటివి తీసుకోవాలి. జింక్‌ను కలిగి ఉన్న పప్పుధాన్యాలు, చిక్కుళ్ళు, పుట్టగొడుగులు, గుమ్మడికాయలను తినాలి. అంతే కాకుండా అన్ని తాజా పండ్లు, కూరగాయలను ఆహారంలో తీసుకోవాలి.

ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ సహకారం ఎలా ఉంది?

అధికారి : ప్రభావిత గ్రామాలలో ఎవరైతే ఫ్లోరోసిస్ వ్యాధితో బాదపడుతూ వుంటారో వారికి పునరావాస సేవల క్రింద ఈ ఫ్లోరోసిస్ ప్రోగ్రామ్ తరపునుంచి వాకింగ్ స్టిక్స్, వాకర్స్, నెక్ బెల్ట్, లంబర్ బెల్ట్, వీల్‌చైర్లు, ఫోల్డబుల్ టాయిలెట్ కుర్చీలు ఉచితంగా ఇస్తున్నాము.

చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

- వృద్ధులకు, వికలాంగులకు డోర్ డెలివరీ
- మంత్రి టిజి. భరత్, కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం కార్డు దారులకు చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. ఆదివారం చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పునఃప్రారంభోత్సవం కర్నూలు నగరం ఎన్‌ఆర్ పేట రోడ్ నెంబర్ 6 లో ఉన్న పిసి. పెద్దయ్య చౌక దుకాణాన్ని మంత్రి టిజి. భరత్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం కార్డుదారులకు రేషన్ ఎండియు వాహనాల ద్వారా పంపిణీ చేసేదని, ఇంటి వద్దకు సరుకులు అందించకుండా వీధి చివరలో వాహనం ఉంచి పంపిణీ చేసేవారని, తద్వారా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. అందులో ఉన్న కష్టాలను కూటమి ప్రభుత్వం 11 నెలలపాటు పరిశీలించి , ప్రజల అభిప్రాయాల సేకరించి సమీక్షించిన అనంతరం కార్డుదారులు సరుకులను రేషన్ షాప్ నుండే పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రతి నెల 1వ తేది నుండి 15వ తేది వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు కార్డుదారులు తమకు ఇష్టమైన సమయంలో వెళ్ళి రేషన్ సరుకులు పొందవచ్చని మంత్రి తెలిపారు. వికలాంగులకు, 65 సంవత్సరాలు పై బడిన వృద్ధులకు నిత్యావసర సరుకులను ఇంటి వద్దకే అందజేస్తారని మంత్రి తెలిపారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందచేయాలన్న ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మంత్రి , జిల్లా కలెక్టర్ కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. తదుపరి మంత్రి టి.జి.భరత్ తో కలిసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ 65 సంవత్సరాలు నిండిన కార్డుదారుడు కొత్తపేట , ఇంటి నంబర్ 41- 161 నివాసి జె .రఘునాథరావు ఇంటికి వెళ్ళి ఈ నెల నిత్యావసర సరుకుల ప్యాకెట్ ను వారికి అందజేసి పథకాన్ని ప్రారంభించారు. కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, జిల్లాపౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ , తహశీల్దార్ వెంకటలక్ష్మి , కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి టిజి. భరత్

కానిస్టేబుల్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

పోలీసు కానిస్టేబుల్ (సివిల్,ఎపిఎస్‌పి) అభ్యర్థులకు కర్నూలులో 16 పరీక్షా కేంద్రాలలో మెయిన్స్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎస్‌పి మాట్లాడుతూ కర్నూలులో మొత్తం 16 పరీక్షా కేంద్రాలలో 7,597 మంది అభ్యర్థులకు గాను 6,947 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఎస్‌పితోపాటు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, డిఎస్‌పిలు శ్రీనివాసాచారి, ఉపేంద్ర బాబు, హేమలత, సిఐలు , ఎస్‌ఐలు ఉన్నారు.

పరీక్షా క్రేందంలో పర్యటిస్తున్న ఎస్‌పి

సైన్స్ ప్రచార రథ సారథకులు మౌనం వీడండి

- విజ్ఞానుల మౌనం అజ్ఞానులకు ఆయుధంగా మారుతోంది
- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బర్మా సురేష్ కుమార్ పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : సైన్స్ ప్రచార రథసారథకులు మౌనం వీడాలని, శాస్త్రీయ విజ్ఞానం కలిగి చదువుకున్న వారు సైతం మౌనంగా ఉండడంతో అజ్ఞానులకు ఆయుధంగా మారిందని, ఇది సమాజానికి చెడు చేస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బర్మ సురేష్ కుమార్ పిలుపు నిచ్చారు. కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని విబిఆర్ కాన్ఫరెన్స్ హాల్లో వేదిక కార్యకర్తల మూడు రోజుల సైన్స్ అవగాహన కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యావంతులు, విజ్ఞానవంతులు కూడా వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా పుంఖాను పుంఖాలుగా ప్రచారంలోకి వస్తున్న ఆశాస్త్రీయ అంశాలను కనీసంగా వాస్తవమా కాదా అని ఫాక్ట్ చెక్ చేయకుండా నమ్ముతున్నారని అత్యధికలు మౌనంగా ఉన్నారని తద్వారా అవే వాస్తవ అంశాలుగా ప్రచారంలోకి వస్తున్నాయని అన్నారు. ఇది సమాజానికి ఏమాత్రం మంచి చేయదన్నారు. త్వరలో కడప జిల్లాలో జెవివి రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని నూతన కమిటీ ఎంపిక విధి విధానాలపై చర్చ జరిగిందని ప్రజాస్వామ్య విధంగా ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలను పూర్తి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వరాజ్యలక్ష్మి , కృష్ణాజి, వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుజాత, మీనా, శ్రీరాములు, వీరేష్, చక్రపాణి, జిల్లా ప్రధానకార్యదర్శి ప్రతాప్ రెడ్డి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి : జెవివి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ప్రస్తుత సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించల్సిన అవసరం ఉందని జెవివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధీర్‌రాజు, కాజా హుస్సేన్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బడేసాహెబ్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు కాజా హుస్సేన్ లతోపాటు జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బడేసాహెబ్ పాల్గొని జెవివి చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో సారా వ్యతిరేక ఉద్యమం నిర్వహించడం జరిగిందన్నారు. అక్షరాస్యత ఉద్యమంలో భాగస్వామ్యం అక్షరాస్యత పెంపుదలకు ఈ సంఘం కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాల విశ్వాసాలను పారద్రోలేందుకు అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ మల్లికార్జున సోషల్ మీడియా విభాగం జిల్లా నాయకులు ఎలా గువ్వేర పలువురు ఉపాధ్యాయులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్నూలు ఎంపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఎంపి బస్తిపాటి నాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టిడిపి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్ చేసి ఎంపికి పుట్టినరోజు రోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని అశోక్ నగర్ వద్ద ఉన్న పట్టణ నిరాశ్రయుల గృహంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపి నాగరాజు సతీమణి జయసుధ పాల్గొని కేక్ కట్ చేసారు. అనంతరం నిరాశ్రయులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎంపి నాగరాజును అభినందించారు. అంతకు ముందు ఎంపి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు , పలు ప్రజా సంఘాల నాయుకులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి జె.దివాకర్

- ఉద్యోగ విరమణ సభలో ఎంఎ.గపూర్, ఆర్.లక్ష్మయ్య
- ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎపి, తెలంగాణ కీలక నాయకుల హాజరు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గపూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మచ్చలేని నాయకుడు, మంచి సుగుణశీలి, అందరికీ ప్రయోజనకరంగా సూటిగా చెప్పే వ్యక్తి, కార్మిక పక్షపాతి జె.దివాకర్ అని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ. గఫూర్ కొనియాడారు. ఆదివారం కర్నూలు ముజఫర్ నగర్ రోడ్డులోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాలులో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలానీబాష అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ దివాకర్ తన ఉద్యోగ ప్రస్థానంలో ఉద్యోగం తీరు ప్రశంసనీయమన్నారు. ఉద్యోగం అటు కుటుంబ బాధ్యతలు, ఎస్‌డబ్ల్యుఎఫ్‌లో మంచి పేరున్న వ్యక్తి అని అన్నారు. ఆర్‌టిసిలో దివాకర్ అందరికీ ఆత్మీయుడుగా, సామాజిక స్పృహతో సమాజ మార్పునకు కృషి చేసి అందరి మన్ననలను పొందారన్నారు. ఆర్‌టిసి ప్రభుత్వ సంస్థగా విలీనమైన తర్వాత కార్మికుల ఆర్థికంగా నష్టపోతున్నారన్నారని, ఆర్‌టిసి కార్మికులకు పని భారం పెరిగిందని, డ్రైవర్ కండక్టర్ ఉద్యోగం కూడా చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డ్రైవర్లకు చేయూతనివ్వాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా కార్మిక వర్గానికి సేవ చేయాలని కోరారు. ఎస్ డబ్ల్యుఎఫ్ సంఘాన్ని విస్తరించడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. ఆయన శేష జీవితం ప్రజాసేవకు అంకితం చేయాలని ఆకాంక్షించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతున్న సమయంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిగా పనిచేసి కండక్టర్‌గా ఉద్యోగంలో చేరిన తర్వాత కార్మికులకు వెన్నుదన్నుగా ఉన్నారని, రాజకీయ సిద్ధాంతంతో పనిచేయడం అభినందనీయమన్నారు.

ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ ఇంత మంచి పేరు రావటానికి దివాకర్ కుటుంబం,ఉద్యోగం ధర్మం నిర్వర్తిస్తూనే ఎస్‌డబ్ల్యుఎఫ్ అభివృద్ధికి పని చేయటానికి అతని భార్య శారదమ్మకే అంతా క్రెడిట్ దక్కుతుందన్నారు. సూపర్వైజర్ క్యాడర్లో ఉండి సంఘానికి సేవ చేయడం కష్టమన్నారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్షలో తొమ్మిది రోజుల్లో కూర్చున్న వారిలో దివాకర్ ఒకరన్నారు. టిమ్స్ మిషన్ ప్రవేశపెట్టిన సందర్భంలో ఆర్‌టిసి నిర్లక్ష్యానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ నడుం బిగించి ఐక్య ఉద్యమం నెలరోజులు సెలవు పెట్టి చేశారన్నారు. ప్రభుత్వం నుండి ఆంగ్లంలో ఏజిఒ వచ్చినా వెంటనే దాన్ని తెలుగులోకి తర్జుమా చేసి అందరికీ దివాకర్ షేర్ చేసే వారని అన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నాయకులు ఎం.ఎ.ఖాన్ మాట్లాడుతూ నిజాయితీగా పనిచేసే మంచి నాయకునిగా అంచలంచలుగా ఎదుగుతూ మచ్చలేని మనిషిగా ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తి దివాకర్ అని కొనియాడారు. తెలంగాణ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విఎస్‌రావు మాట్లాడుతూ తాను ఉద్యోగ వృత్తిని చేస్తూనే ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్‌కు ప్రవృత్తిగా పనిచేశారన్నారు. కార్మిక ప్రజా ఉద్యమాలకు కృషిచేసి, తాను నమ్మిన సిద్ధాంతం కోసం లక్ష్యం కోసం పోరాడారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ కండక్టర్‌గా చేరి అంచలంచెలుగా ఎదిగి సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగినా అందరినీ సమానంగా చూసేవారని ఆయనలో పైన ఒకటి లోపల ఒకటి లేదని, వామపక్ష భావాలతో దృఢ సంకల్పంతో పని చేశారన్నారు. ఇందులో చదువుల తల్లి ఆయన సతీమణి శారదమ్మ పాత్ర ముఖ్యమైందని పరిపూర్ణమైన మానవ జీవితం గడిపారన్నారు. తెలంగాణ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు మాట్లాడుతూ దివాకర్‌ను వజ్రంతో పోలుస్తూ సమాజ లక్ష్యం కోసం ఇది నా బాధ్యతగా భావించి తాను నమ్మిన లక్ష్యం కోసం పని చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఎపిఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎవి.రామయ్య మాట్లాడుతూ దివాకర్ మంచి సువర్ణశీలి అందరికి ప్రయోజనకరంగా సూటిగా ఏ విషయమైనా చెప్పే వ్యక్తి అని కొనియాడారు. నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, వీరాంజనేయులు, ఇ శ్రీనివాసులు, గంగాధర్, రామయ్య అజాంఖాన్, మల్లికార్జున్ రావు, కృష్ణారెడ్డి, రంగన్న, శేఖర్, మహిళా సంఘం నాయకురాలు పి.నిర్మల, జిల్లా నాయకురాలు ఎన్.అలివేలు, నంద్యాల నాయకులు కృష్ణారెడ్డి, నంద్యాల సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, వినుకొండ ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు నాగేంద్ర, రైతు సంఘం నాయకులు రామేశ్వరరావు, వ్యక్తం కర్నూల్ టూ డిపో కార్యదర్శి దేవరాజు, అనంతపురం రంగన్న, హైదరాబాద్ మిత్రులు సాంబయ్య, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇ.పుల్లారెడ్డి, ఆయనతో అనుబంధం ఉన్న వివిధ సంఘాల నాయకులు, ఆత్మకూరు, నంద్యాల, కర్నూలు పార్టీ శ్రేణులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనతో ఉన్న సంబంధాన్ని గురించి తెలిపారు. అనంతరం శారదమ్మ, జె.దివాకర్‌లను గజమాలతో ఘనంగా సత్కరించారు. వివిధ సంఘాల నాయకులు పూల దండలు శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

దివాకర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఎ.గపూర్, ఆర్.లక్ష్మయ్య తదితరులు

డిసిఎంఎస్‌కు వన్నె తెస్తా : నాగేశ్వర రావ్ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా కోపరేటివ్ అండ్ మార్కెటింగ్ సొసైటీకి, చైర్మన్ పదవికి వన్నెతెస్తానని నూతన డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కర్నూలు డిసిఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో డిసిఎంఎస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డిసిసిబి సిఇఒ రామాంజనేయులు, కెడిసిఎంఎస్ మేనేజర్ రాజేష్, కుటుంబ సభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కర్నూలు డిసిఎంఎస్ తీవ్రంగా అలసత్వానికి గురైందన్నారు. జిల్లాలో డిసిసిబి ఆర్థికంగా, ఆస్తులపరంగా డిసిఎంఎస్ బలమైందని అన్నారు. ఆర్‌బికెల పేరుతో డిసిఎంఎస్ వ్యవస్థను గత ప్రభుత్వం నీరు గార్చిందన్నారు. అంతేకాకుండా డిసిఎంఎస్ ఆస్తులు అన్యాక్రాంతానికి గురయ్యాయని అన్నారు. తాను గతంలో జడ్‌పి చైర్మన్ గాను, రాష్ట్ర గొర్రెల పెంపకం దారుల సొసైటీకి చైర్మన్‌గా ఉన్నప్పుడు రూ. 80 కోట్లు నిధులను రాబట్టగలిగానని మరో దశలో అనేక కోట్లను తీసుకువచ్చే సమయంలో ప్రభుత్వం మారిందని, తాను కొనసాగి ఉంటే ఎంతో అభివృద్ధి చేసి చూపే వాడిన అన్నారు. తనకు డిసిఎంఎస్ చైర్మన్గా ముఖ్యమంత్రి నియమించారని పదవి చిన్నదైనా పెద్దదైన దానిపట్ల అంకితభావంతో పనిచేసే వన్నె తెస్తానని అన్నారు. తనకు ఈ పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ ఇది బిసిల ప్రభుత్వమని బిసిలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఎన్నో తప్పులు చేసిందని తప్పులు చేసిన వారిని ఎవరిని వదలమని అన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావ్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు పట్టణం బిర్లా గడ్డలో 26 వ వార్డ్ తారకరామ్ నగర్‌కు చెందిన టిడిపి కార్యకర్త అనిల్ ఆధ్వర్యంలో అతని సోదరుడు వెంకట రత్నం జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, పాణ్యం నియోజకవర్గం యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున యువకులు రక్త దానం చేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వారికి రక్త దానం చేస్తే ప్రాణదాతలు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టిడిపి కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

ప్రతి పేదవానికి నిత్యవసర సరుకులు అందించడానికి రేషన్ దుకాణాలు కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని 16వ వార్డు సున్నం బట్టి వద్ద 33-నరసింహులు, 43- జిలాన్ రేషన్ షాపులను ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి సందర్శించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ పేరుతో వాహనాన్ని పంపేదని, అయితే ఆ సమయంలో సరుకులు తీసుకోకపోతే రేషన్ సరుకులు అందేవి కాదని అన్నారు. ప్రతి పేదవానికి నిత్యవసరకులు అందడానికి రేషన్ దుకాణాలు కూటమి ప్రాంతం ప్రభుత్వం ప్రారంభించింది అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటికి సరఫరా చేస్తామని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా వారికి బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

కోసిగి: ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామ సర్పంచి కుమారి అయ్యమ్మ అధ్యక్షతన గ్రామంలో ఉన్న బసలదొడ్డి ఈరన్న , షాప్ నెం:-40 3వార్డు,కప్పయ్య షాప్ నెం:-1 1వ వార్డ్ , షాప్ నెంబర్ 11 లోని ఎనిమిదో వార్డు ఉడుమయ్య షాప్‌లలో వృద్ధులకు , వికలాంగులకు ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేశారు. మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఇంటివద్దకే రేషన్ అంటూ రూ.1600 కోట్ల దోపిడీకి తెర లేపారని, ,ఎక్కడా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. రేషన్ బియ్యం అందక ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయన్నారు. అందుకే పాత విధానాన్ని మళ్లీ మన టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. నెలలో 15 రోజులపాటు 2 పూటలా రేషన్ పంపిణీ ఉంటుందని ,దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్దే రేషన్ ఇస్తారన్నారు. తహశీల్దార్ రుద్ర గౌడ్ , టిడిపి నాయకులు ముత్తురెడ్డి , వక్రాణి వెంకటేశ్వర్లు , జక్కన గేని.వెంకటేశ్వర్లు , హెులగుంద.కోసిగయ్య , మాణిక్ రాజ్ , మూడు మండలాల కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర్‌రెడ్డి

ఆస్పరి: రేషన్ షాపులలో నిత్యవసర సరుకులు పకడ్బందీగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి రేషన్ డీలర్లను ఆదేశించారు. మండలంలోని ఆయా రేషన్ షాపుల దగ్గరకు వెళ్లి తనిఖీ చేశారు. వృద్ధులకు,వికలాంగు లకు ఇంటి దగ్గరికె వెళ్లి స్టేషన్ డోర్ డెలివరీ చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లిన రేషన్ బియ్యం

హాలహర్వి: మండలంలో అన్ని రేషన్ షాపులో నిత్యవసర సరుకులు పంపిణీ ప్రారంభమైంది. ఇన్‌ఛార్జి తహశీల్దార్ లక్ష్మి ఆదేశాలతో అన్ని రేషన్ షాపుల్లో నిత్యవసర సరుకులు బియ్యం పంచదార ఉదయం ఏడు గంటలకే ప్రారంభించారు. ఆర్ఐ మహేష్ గౌడ్ టిడిపి నాయకులు కార్యకర్తలు రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోసిగిలో బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి

గూడూరు: నగర పంచాయతీలో ఉన్న డీలర్ షాపులను టిడిపి నాయకులు, మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, కౌన్సిలర్ రేమట సురేష్, శేషావలి, రేమట వెంకటేష్, చాంద్ బాషా, ఎల్లయ్య రేషన్ షాపులను ఆదివారం ప్రారంభించారు. అనంతరం రేషన్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు, శేషు, శీను పాల్గొన్నారు.

దేవనకొండ: రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు దారులకు రేషన్ పంపిణీ దుకాణ డీలర్ల ద్వారా ఆదివారం నుండి ప్రారంభించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని నిబంధన ఉన్నప్పటికీ దేవనకొండ మండలంలోని డీలర్లు ఆ నిబంధన పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రమైన దేవనకొండలో రేషన్ దుకాణాల వద్ద వికలాంగులు, వృద్ధులు ఆదివారం పడి కాపులు కాశారు. మరోవైపు సర్వర్ సమస్య నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో మరింత ఆలస్యం అయింది. అదేవిధంగా కార్డుదారులకు అందించే బియ్యంను డబ్బా పెట్టి కొలత వేస్తుండడంతో కార్డుదారులకు అందాల్సిన బియ్యంలో కొంత కోత పడుతున్నట్లు కార్డుదారుల నుండి ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి రేషన్ పంపిణీ పరిశీలించి వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

మృగాళ్ల చేతిలో బాల్యం బలి

- మూడు నెలల్లోనే ఇద్దరిపై లైంగిక దాడి
- భయాందోళనతో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కౌతాళం

కల్మషం లేని నవ్వులు చెరిగిపోతున్నాయి. కపటం లేని చూపులు మృగాళ్ల కామ దాహానికి బలవుతున్నాయి. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన కౌతాళం మండలంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి నెల 4న చూడి గ్రామంలో తండ్రి వయసులో ఉన్న ఒక మానవ మృగం ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ ఘటన మరువక ముందే మే 29న వల్లూరు గ్రామంలో 7 ఏళ్ళ చిన్నారిపై 20 సంవత్సరాల యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా కొన్ని వెలుగు చూస్తుండగా మరికొన్ని సంఘటనలు కుటుంబ పరువుతో అక్కడికక్కడే బయటకు రాకుండా సమాధి అవుతున్నాయి. చిన్నారుల పైనే కాకుండా మహిళలపై అనేక గ్రామాల్లో జరుగుతున్న సంఘటనలు వెలుగులోకి రాలేకపోతున్నాయి. కొన్ని గ్రామాలలో రాజకీయ, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీలు చేసి కుటుంబ పరువుకు వెల కట్టి సరి చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కౌతాళం పోలీస్ స్టేషన్ రికార్డుల ప్రకారం 2022 నుంచి ఇప్పటి వరకు నాలుగు ఫోక్సో కేసులు నమోదు అయ్యాయి. 2022లో, 2024లో ఒక్కోటి చొప్పున, 2025లో ఈ మూడు నెలల వ్యవధిలో రెండు ఫోక్సో కేసులు నమోదయ్యాయి. ఇది ఆందోళన కలిగించే విషయం అని ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. జిల్లాలోని పశ్చిమ గ్రామీణ ప్రాంతాలలో చాలా కుటుంబాలు వలసలు వెళ్తారు. అనేక కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. చిన్న సన్నకార రైతులు, వ్యవసాయ కూలీలు పిల్లలను ఇంటి వద్దే వదిలి వ్యవసాయ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి కుటుంబాలు చిన్నారులను వదిలి వెళ్లాలంటే భయాందోళనకు అవుతున్నారు. ప్రజలలో నెలకొన్న భయాందోళనలను తొలగించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, న్యాయస్థానాలు ఎలాంటి కొత్త చట్టాలు అమలు చేస్తారో ప్రజలలో అవగాహన కల్పించాలి. గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత లేకపోవడంతో చట్టాలపై అవగాహన లేక ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. పోలీస్ శాఖ వారు ఇలాంటి ఆకతాయిలపై ప్రత్యేక నిఘ ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కఠినంగా శిక్షించాలి

- అవతారం, జై భీమ్ సంఘం వ్యవస్థాపకులు.

చిన్నారులపై జరుగుతున్న ఘోర సంఘటనలను అరికట్టడానికి పోలీస్ శాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలి. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

బాధ్యతలు చేపట్టిన హెచ్ఎంలు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పురపాలక యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొంది, వారికి కేటాయించిన నూతన పాఠశాలల్లో ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. కల్లుబావి హైస్కూల్లో హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన గిరిబాబును ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పూలమాల శాలువ తో సన్మానించారు. హస్మియా ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాల నూర్ బాష, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల ఫయాజిద్దీన్, ఆర్ఆర్.కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల కె.రవి, కల్లూభావి పురపాలక ఉన్నత పాఠశాలకు గిరిబాబు, కిలిచిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాల కు బి.ఉరుకుందప్ప నూతనంగా ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకున్నారు. నూతన ప్రధానోపాధ్యాయులకు ఎస్టియు నాయకులు సుధాకర్ బాబు, ప్రహ్లాద, లోక్యనాయక్, రాజా సతీష్, ప్రసాద్, రమేష్ నాయుడు, ఖలీల్, జుబేర్, వీరచంద్ర యాదవ్, రామయ్య, గురుస్వామి, గురు రాజా, శ్రీరాములు, భీమరాజు, గంగ నాయక్, రాముడు,నాగేష్ అభినందించారు.

చంద్రబాబు ప్రజలను మోసం చేశారు

ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

ఆచరణలో సాధ్యం కాని వాగ్దానాలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో 'వెన్నుపోటు దినం' పోస్టర్ ను ఆవిష్కరించారు. పార్టీ ఆదిష్టానం ఆదేశాల మేరకు టిడిపి ఏడాది పాలన పై జూన్ 4న వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమం ఉంటుందని అబోడే హోటల్ నుంచి తహశీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసిందని విమర్శించారు. కూటమి పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోందన్నారు. ఒక్క ఎన్నికల హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా, ప్రజలను మోసంచేశారని, ఇది చరిత్రలో ఎప్పుడూ జరిగి ఉండదని తెలిపారు. వాటిని ప్రశ్నించకుండా రాష్ట్రంలో ప్రభుత్వమే భయాన్ని సృష్టించిన చరిత్ర కూడా ఎప్పుడూ ఎవరూ చూసి ఉండదన్నారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ, ఏడాదిలోనే తొంబై తొమ్మిదిశాతం అమలు చేసిన ఘనత వైఎస్.జగన్ దే అన్నారు. విప్లవాత్మక వ్యవస్థలను సృష్టించి, ఆచరణలోకి తీసుకువచ్చి, ప్రజల వద్దకే సుపరిపాలనను తీసుకువెళ్ళి సేవలు అందించి చరిత్ర సృష్టించింది జగన్మోహనరెడ్డే అన్నారు. ప్రస్తుతం దానికి భిన్నంగా ఆ వ్యవస్థలను విధ్వంసాన్ని సృష్టించి అరాచక పాలనను ఏడాదిలోనే చంద్రబాబు ప్రజలకు చవిచూపించారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎటువంటి దారుణాలకు పాల్పడవచ్చో కూడా చంద్రబాబు నిరూపించారని తెలిపారు. వైసిపి నియోజకవర్గ నేతలు పురుషోత్తం రెడ్డి, భీమారెడ్డి, రామ్మోహన్ రెడ్డి ,మురళి మోహన్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, బెట్టిన గౌడ్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం'పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

శ్రీ మఠం మేనేజర్ గా మళ్లీ ఎస్‌కె శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్‌గా ఎస్.కె. శ్రీనివాసరావు మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆదివారం రాఘవేంద్రస్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పరిపాలనా కార్యాలయంలో ఎఎఒ మాధవ శెట్టి మేనేజర్ వెంకటేష్ జోష్ఠి ద్వారా బాధ్యతలు చేపట్టారు. అనారోగ్య కారణాల వల్ల విధుల నుంచి వెళ్లిపోయిన ఆయన మళ్లీ మేనేజర్‌గా రావడంతో ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏడాది పాలనలో ఎమ్మెల్యే వైఫల్యం

ప్రజాశక్తి-ఆదోని

ఏడాదిపాలనపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ హమ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ముందుగా రాష్ట్రాన్ని అభివద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎంహెచ్ పి.సమితి. తరపున అభినందనలు తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఏడాది పాలనలో గతపాలన కాలపు అవినీతిపరులను ఎంత మందిని జైలుకు పంపినారు, ఎంత మంది భూకబ్జాకోరుల పై కేసులు నమోదు చేయించారో ప్రజలకు తెలపాలన్నారు. ఆదోనిలో ఎంత మాత్రం అభివృద్ధి పనులు చేశారని, ఎంత మాత్రం నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదోని అభివృద్ధి కోసం సాధించి తీసుకు వచ్చారని వివరించాలన్నారు.ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైందని, నీటి సమస్య మరింత జటిలంగా మారిందన్నారు. ఆదోని ఎమ్మెల్యేగా గెలిస్తే తాను కుటుంబ సమేతంగా ఆదోనిలో నివసిస్తానని ఎమ్మెల్యే పార్థ సారథి ఆదోని ప్రజలకు మాటిచ్చి మాట తప్పారన్నారు. ఆదోనిలో ఉంటూ ఆదోని ప్రజల కష్టాల తీర్చవలసిన ఎమ్మెల్యే పార్థ సారథి, అప్పుడప్పుడు మాత్రమే టూరిస్టు యాత్రికునిలా ఆదోనికి వచ్చి వెళ్ళటం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి ముఖ్యమంత్రి చంద్రబాబు బాటలో నడిచి ఆదోనిని అభివృద్ధి చేయాలన్నారు. .

మా పొలాలను కబ్జా చేస్తున్నారు...

ప్రజాశక్తి-కోసిగి

మా పొలాలను కబ్జా చేస్తున్నారని తాము సాగు చేస్తున్న మాపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రామానికి చెందిన చాకలి హంపమ్మ , మందుల నరసమ్మలు ఆదివారం రేషన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డికి ఫిర్యాదు చేసి కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు మాట్లాడుతూ తమ పొలంలో దౌర్జన్యంగా దిగి దాడులు చేశాడని గతంలో అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అదేవిధంగా గౌడగల్ గ్రామంలోసర్వే నెంబర్ 68/1,68/3 వైసిపి నాయకుడైన హరిజన చిలకప్ప అనే వ్యక్తి కులాన్ని, పార్టీనీ అడ్డుపెట్టుకుని భయంబ్రాంతులకు గురి చేస్తూ అందులో కొంత భూమిలో దౌర్జన్యంగా చొరబడి కబ్జా చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై మంత్రాలయం టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ వైసిపి అయినా మరే పార్టీ అయినా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పక్కనే ఉన్న తహశీల్దార్‌కు, ఎస్ఐకి తమ సమస్య చెప్పాలని వెంటనే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఇలాంటి సమస్యలు ఏమైనా ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ కబ్జా దారుని నుండి భూమిని విడిపించి మాకు న్యాయం చేయగలరని బాధితులు కోరారు

టిడిపి నేత రాఘవేంద్రరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మహిళ

రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేదు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న నిత్యవసర సరుకుల పంపిణీలో అవకతవకలకు చోటు ఉండరాదని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ నగర్ చౌక ధరల దుకాణంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సమయంలో తప్పనిసరిగా కార్డుదారులకు బియ్యం పంపిణీ జరగాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ప్రతి ఎఫ్‌పి షాప్ నందు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగినదని, దీని ద్వార ప్రజల తమ అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేయవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర వస్తువులు అందరికీ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు మేలు కలిగే విధంగా ఈ దుకాణం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివ రాముడు, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దారు వలి భాష, రీ-సర్వే శాఖ ఉప తహశీల్దారు పెద్దయ్య పాల్గొన్నారు.



పిల్లలకు గ్రంధాలయాలను పరిచయం చేద్దాం

గ్రంధాలయం జిల్లా కార్యదర్శి కాటం ప్రకాష్

ప్రజాశక్తి - ఆలూరు

చిన్నతనం నుండే పిల్లలకు గ్రంధాలయని పరిచయం చేపించాలని తల్లితండ్రుల నిద్దేశించి జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆలూరు గ్రంధాలయం కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంధాలయం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ఆలూరు గ్రంధాలయని సందర్శించిన కార్యదర్శి కాటం ప్రకాష్ మాట్లాడుతూ గ్రంధాలయాలను పిల్లలకు పరిచయం చేస్తూ వారిలో పుస్తక పఠనం పెంపొందించి సృజనాత్మకతను వెలికి తీయడం కోసమే ఈ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరు గ్రంధాలయ అధికారి కె.విజయభాస్కర్, పాఠకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కారణం చూపకుండా ఉద్యోగాలు తొలగించారు

ఫ్యాక్టరీ ముందు నిరసన చేపట్టిన ఉద్యోగులు

ప్రజాశక్తి- మంత్రాలయం

మండల పరిధిలోని మాధవరం సూగూరు గ్రామాల మధ్య ఉన్న మారుతి ఇస్పాత్ ఉక్కు ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగులను కారణం చూపకుండా తొలగిస్తున్నారని బాధిత ఉద్యోగులు టిప్పు సుల్తాన్, రాజశేఖర్ యాదవ్ ప్రభాకర్‌లు ఆరోపించారు. ఆదివారం ఫ్యాక్టరీ ముందు నిరసన చేపట్టి ఫ్యాక్టరీలోకి విధులకు వెళ్లే ఉద్యోగులను అడ్డగించి రేపు మీకూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని సహకరించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భూముల సేకరణ సమయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం నిభందనల ప్రకారం 70 శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, విద్య, తాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారని వాటిని అతిక్రమించి కేవలం 20 శాతం మందికి స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చారని మిగిలిన 80 శాతం మంది బీహార్, ఒరిస్సా, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి అవకాశం కల్పించారని తెలిపారు. గత 8 ఏళ్లుగా పనిచేస్తున్న మమ్మల్ని కారణం లేకుండా తొలగించారని ఇప్పుడు మా పరిస్థితి ఏంటని, మా కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇప్పటికే 17 మందికి పనులకు రావద్దని చెప్పారని, నలుగురు వెళ్లి పోయారని మిగిలిన వారిపై ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. కనీసం ఇన్ని రోజులు చాలీ చాలని వేతనాలతో సేవలు చేసిన మాకు ఆర్థిక భద్రత కోసం కొంత నగదునైనా ఇవ్వాలని కోరగా కేవలం 10 వేల రూపాయలు మాత్రమే ఇస్తామని వెళ్లి పోండి అంటూ ఆదేశించారని ఆవేధన వ్యక్తం చేశారు. ఉద్యోగంలోకి మళ్లీ తీసుకునే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ విషయం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మారుతీ ఇస్పాత్ కంపెనీ ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-మంత్రాలయం

మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి బన్న లక్ష్మప్ప (40) గుండె పోటుతో మృతి చెందారు. ప్రతి రోజూ రచ్చుమర్రి గ్రామం నుండి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరుకు వెళ్లి రోజు వారి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పారిశుధ్య పనులు చేస్తున్న నేపథ్యంలో ఆదివారం మద్యాహ్నం ఛాతి నొప్పి రావడంతో మహేంద్ర అనే మేస్త్రీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

-బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని రాజశేఖర్ గౌడ్ చౌక ధరల దుకాణంలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని రేషన్ సరుకుల లభిదారులతో కలసి రిబ్బన్ కట్ చేసి తహశీల్దార్ శ్రీనివాసులు, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్ లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు 15 రోజులు రేషన్ దుకాణ షాపులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 వరకు రేషన్ పంపిణీ చేస్తారని చెప్పారు. 65 సంవత్సరాల నిండిన లబ్ధిదారులకు ఇంటి దగ్గరే రేషన్ సరుకులు అందిస్తారన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఈరన్న గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ముగతి విఆర్‌ఓ చక్రవర్తి గౌడ్, మాజీ గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్, మాజీ సర్పంచ్ బాలరాజు, ధర్మారెడ్డి, డీలర్ రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

రోజుకు 8 గంటలు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి- కౌతాళం

పేద ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి రోజుకు ఎనిమిది గంటలు రేషన్ పంపిణీ కూటమి ప్రభుత్వం చరిత్రత్మక నిర్ణయం తీసుకుందని మంత్రాలయం టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, తుంగభద్ర ప్రాజెక్టు చైర్మన్ టిప్పుసుల్తాన్, టిడిపి రైతు సంఘం రాష్ట్రచ జిల్లా కార్యదర్శి అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు పేర్కొన్నారు. ఆదివారం కౌతాళంలో 7,8, 13 వార్డులలో రేషన్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గతంలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రోజుకు ఎనిమిది గంటలకు పాటు 15 రోజుల వరకు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్‌రెడ్డి, ఆర్ఐ లక్ష్మన్న, టిడిపి నాయకులు రాజానందు, వీరేష్ మూకన్నా తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణంకు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఆదోని

విద్యుత్ శాఖలోని ఆదోని డి 1 సెక్షన్లో ఏఈ గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన నాగభూషణం దంపతులకు ఘన సన్మానం చేశారు. ఉద్యోగులు,బంధువులు పూలమాల శాలువతో ఘన సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. బాణాసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడారు 1993లో ఉద్యోగంలో చేరి అంకితభావంతో విధులు నిర్వహించి సంస్థ పురోగతికి కృషి చేశానన్నారు వినియోగదారులకు అందుబాటులో ఉండి పలువురి మన్ననలు పొందమన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లు లోకేష్, చెన్నయ్య, ఉలిగప్ప ,ఉద్యోగులు వీరరాజు, గోవిందు ,సీన బంధువులు తదితరులు సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-హాలహర్వి

హాలహర్వి జిల్లా పరిషత్ హై స్కూలులో చదువుకున్న 1991-92 విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా సాగింది. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం గర్వంగా ఉందన్నారు. 33 ఏళ్ల తర్వాత కూడా తమను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులు ఉమాపతి, ప్రహ్లాద్ రెడ్డి, రామారావు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

యస్.ఓ.పి.నెం.2/2025

1. శ్రీమతి గుండా గీతాసుధా భర్త జి.మధుసుధన్‌శెట్టి, వయస్సు 53 సంవత్సరాలు.
2. గుండా హేమంత్‌కుమార్ తండ్రి జి.మధుసుధన్‌శెట్టి, వయస్సు 33 సంవత్సరాలు.
3. గుండా అఖిల్‌కుమార్ తండ్రి జి.మధుసుధన్‌శెట్టి, వయస్సు 29 సంవత్సరాలు.

అందరిది ప్రస్తుత నివాసం.ఇంటి.నం.51-1403, సీతారామ్‌నగర్, కర్నూలు టూన్ మరియు జిల్లా

...అర్జీదారులు

-వర్సెస్-

ది చీఫ్ మేనేజర్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, మౌర్యా ఇన్ దగ్గర, కర్నూలు.

...రెస్పాండెంట్

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా కర్నూలు మండలం, సీతారామ్‌నగర్, కర్నూలు సిటి గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు యస్.ఓ.పి లో 1వ అర్జీదారురాలి యొక్క భర్త మరియు 2వ, 3వ అర్జీదారులు యొక్క తండ్రి 19-7-2007 నుండి కనిపించనందున వారి యొక్క భర్త, తండ్రిగారు ఉన్నప్పుడు చేసిన ఇన్సూరెన్స్ పాలసీ (యల్.ఐ.సి) యొక్క మెచ్యూరిటి డబ్బులు పొందుటకుగాను,అర్జీదారులకు వారసత్వ సర్టిఫికేటు కోరుతూ పై కోర్టులో అర్జీదారులు అర్జీదాఖలు చేసినారు. ఇందులో ఎవరికైన ఏమైన ఆక్షేపణలు ఉన్న 23-6-2025 తేది పగలు 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరె పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 23-6-2025

హెచ్.కె.జలంధర్‌రావు,
జి.గోపాలకృష్ణయ్య,
అర్జీదారుల పరం అడ్వకేట్లు,
కర్నూలు.